# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-06-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అన్నదాత సుఖీభవ పథకంతో పాటు పలు అంశాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష నిర్వహిస్తారు.**

2. **విజయవాడ విమానాశ్రయంలో ఆధునిక సౌకర్యాలతో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకురానున్నామని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు.**

3. **గుంటూరు జిల్లా మంగళగిరిలో రైల్వే పైవంతెన నిర్మాణానికి కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారా లోకేష్ ఈ రోజు శంకుస్థాపన చేశారు.**

4. **ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని హోంమంత్రి వంగలపూడి అనిత సూచించారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు అంశాలపై ఈరోజు సమీక్ష నిర్వహించనున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మధ్యాహ్నం జరిగే ఈ సమావేశంలో అన్నదాత సుఖీభవ పథకం అమలు పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. అలాగే రాష్ట్రంలోని ఆక్వా రంగం, మామిడి, పొగాకు పంటల పరిస్థితి, రైతులకు అందిస్తున్న మద్దతు, మార్కెటింగ్ సౌకర్యాలు, ఎగుమతుల అవకాశాలు వంటి అంశాలపై అధికారులతో చర్చించనున్నారు. అనంతరం సాయంత్రం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ–ఆర్టీజీఎస్ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించనున్నారని అధికారులు తెలిపారు.

------------------------

విజయవాడ విమానాశ్రయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్‌తో కలిసి ఈరోజు పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, టెర్మినల్ నిర్మాణ పనులను మరో నాలుగు నెలల్లో పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానున్నామని అన్నారు. విమానాశ్రయ విస్తరణ, ఆధునిక సౌకర్యాల కల్పనతో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.

------------------------

గుంటూరు జిల్లా మంగళగిరిలోని నిడమర్రు రైల్వే పైవంతెన –ఆర్వోబీ నిర్మాణానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని మంత్రులు ఆవిష్కరించారు. అనంతరం నారా లోకేష్ మాట్లాడుతూ, రైల్వే లెవల్ క్రాసింగ్ కారణంగా ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతుండటంతో 142 కోట్ల రూపాయల వ్యయంతో ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఆర్వోబీ నిర్మాణం పూర్తయిన తర్వాత మంగళగిరి, నిడమర్రు, తాడికొండ, అమరావతి ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని తెలుపుతూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

సింగపూర్‌లో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా మెరీనా బే శాండ్స్‌లో ఉన్న సింగపూర్ జాతీయ పర్యావరణ సంస్థ కార్యాలయాన్ని ఆయన ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ కోలిన్ గోతో మంత్రి సమావేశమయ్యారు. సింగపూర్‌లో పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రతకు సంబంధించి అమలు చేస్తున్న విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం గురించి మంత్రి తెలుసుకున్నారు. అనంతరం సింగపూర్‌లోని తువాస్ సౌత్ వ్యర్థ నిర్వహణ కేంద్రాన్ని సందర్శించి వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే విధానాన్ని పరిశీలించారు.

---------------------------

గత 12 ఏళ్ల కాలంలో దేశ రక్షణ రంగంలో స్వావలంబనకు పెద్దపీట వేయడంతో పాటు, రక్షణ సాంకేతికతలో స్టార్టప్‌ల అభివృద్ధికి ప్రోత్సాహం లభించిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ అన్నారు. 12 ఏళ్ల కాలంలో దేశ భద్రతా వ్యవస్థలో వచ్చిన మార్పులపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తూ దేశ భద్రతను మరింత బలోపేతం చేసిందని చెప్పారు. సాయుధ దళాల్లో మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందని తెలిపారు. దేశ భద్రత, రక్షణ రంగాల బలోపేతంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు నవ భారత నిర్మాణానికి దోహదపడుతున్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

---------------------------

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాకలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో 'యోగాంధ్ర' కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌తో పాటు ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన ప్రాచీన వారసత్వమని పేర్కొన్నారు. ఒత్తిడితో కూడిన జీవనశైలిలో యోగా ఆరోగ్యకరమైన జీవితానికి మార్గమని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని మంత్రి సూచిస్తూ,

వాయిస్ .30..సెకన్లు

---------------------------

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి ఈ రోజు పాల్గొని ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వ్యవసాయం దాని అనుబంధ శాఖలకు సంబంధించిన వినతులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించామని తెలిపారు.

---------------------------

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ –ఏపీఎల్ క్రికెట్ పోటీలు ఈ రోజు నుంచి ప్రారంభమవుతాయి. ఈ నెల 21వ తేదీ వరకు మ్యాచ్‌లు జరగనున్నాయి. విజయవాడ సన్ షైనర్స్ – తుంగభద్ర వారియర్స్ మధ్య తొలి మ్యాచ్ కడపలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ స్టేడియంలో రాత్రి 7 గంటలకు జరగనుంది. ఈ టోర్నీలో రాయల్స్ ఆఫ్ రాయలసీమ, భీమవరం బుల్స్, కాకినాడ కింగ్స్, అమరావతి రాయల్స్, వైజాగ్ లయన్స్, తుంగభద్ర వారియర్స్, విజయవాడ సన్‌షైనర్స్ జట్లు పోటీపడనున్నాయి.

------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 135వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 26వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

తూర్పు విదర్భ, తెలంగాణ మీదుగా దక్షిణ కోస్తాంధ్రప్రదేశ్ వరకు ఉపరితల ద్రోణి విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రానున్న రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ...

..వాయిస్.. 25 సెకన్లు

========================